
రాత్రి 10.15 గంటలు.. : మంచిర్యాల రైల్వేస్టేషన్ ఎదుట నిద్రిస్తున్న ప్రయాణికులు


రాత్రి 10.21 గంటలు.. : పోస్టాఫీస్‌కు పార్సిళ్లను తీసుకెళ్తున్న సిబ్బంది


రాత్రి 10.25 గంటలు.. : నిర్మానుష్యంగా మార్కెట్ రోడ్డు


రాత్రి 10.30 గంటలు.. : మార్కెట్ రోడ్డులో మిర్చి వేస్తున్న దుకాణాదారు



రాత్రి 10.40 గంటలు.. : మార్కెట్ రోడ్డులో జ్యూస్ బండ్లు


ఉదయం 6.47 గంటలు.. : ఓవర్ బ్రిడ్జి వద్ద సూర్యోదయం

రాత్రి 12.45 గంటలు.. : బస్టాండ్‌లో పాలు దించుతూ..


ఉదయం 4.06 గంటలు.. : కూరగాయలు కొనుగోలు చేస్తున్న వ్యాపారులు


రాత్రి 11.15 గంటలు.. : నిర్మానుష్యంగా ఉన్న ఐబీ చౌరస్తా


ఉదయం 4.20 గంటలు.. : మార్కెట్‌లో టీ చేస్తూ..


అర్ధరాత్రి 1.03 గంటలు.. : చలి కాగుతున్న యువకులు


ఉదయం 6.15 గంటలు.. : కాలేజీ రోడ్డులోని ఓపెన్ జిమ్

# జన జీవన చలి పొద్దు..

మంచిర్యాల జిల్లాను వణికిస్తున్న వింటర్

- రోజురోజుకూ పడిపోతున్న కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి
- ఇగం వేళ 'నమస్తే' ప్రత్యేక చిత్రమాలిక

*మంచిర్యాల జిల్లాలో చలి తీవ్రత రోజురోజుకూ పెరిగిపోతున్నది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలలోపే ఉండగా, ఇక కనిష్ట ఉష్ణోగ్రతలు నిత్యం పడిపోతున్నాయి. ఈ నేపథ్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వరకు ఆయా చోట్ల వివిధ పనులు చేసుకుంటున్న వారు, నిర్మానుష్యంగా ఉన్న రోడ్ల ఫొటోలను 'నమస్తే తెలంగాణ' చిత్రీకరించింది. వణుకు పుట్టిస్తున్న చలిలో తమ జీవిత గమనాన్ని కొనసాగిస్తున్న వివిధ వర్గాల చిత్రాలను ఒడిసిపట్టింది. ఈ చిత్రాలు 'మీ కోసం..*

*కాగా.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నది. గత వారం రోజుల్లోనే ఉష్ణోగ్రతలు పది డిగ్రీలు పడి పోయాయి. ఇక డిసెంబర్ మాసంలోనే పరిస్థితి ఇలా ఉంటే, రానున్న జనవరి, ఫిబ్రవరి నెలల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుతం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 10.5, ఆదిలాబాద్‌లో 11.6, మంచిర్యాలలో 13.0 నిర్మల్‌లో 12.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.*

- మంచిర్యాల ఫొటోగ్రాఫర్/నిర్మల్ అర్బన్, డిసెంబర్ 14


ఉదయం 4.50 గంటలు.. : మున్సిపల్ కార్మికుల హాజరు తీసుకుంటున్న జవాను



ఉదయం 5.05 గంటలు.. : బల్దియాలో వీధులు శుభ్రం చేస్తూ..


ఉదయం 5.35 గంటలు.. : లోగో వద్ద ప్రయాణికుల కోసం ఆటోలు


ఉదయం 6.01 గంటలు.. : తెల్లవారుజామున హైవే రోడ్డు

# అట్టుడికిన రిమ్స్

## దుండగుల దాడిని నిరసిస్తూ మెడికోల ఆందోళన

- విధులు, తరగతులు బహిష్కరించి బైఠాయింపు
- రెండు గంటలపాటు రిమ్స్, కలెక్టరేట్ ఎదుట ధర్నా
- డైరెక్టర్ దిష్టిబొమ్మను దహనం చేసిన వైద్యవిద్యార్థులు
- నిందితులను శిక్షించే వరకు ఆందోళన కొనసాగిస్తాం..
- కలెక్టర్ రాహుల్‌రాజుకు వినతిపత్రం అందజేత
- అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతికుమార్, బీజేపీ కార్యకర్త శివలపై కేసు
- మద్దతు ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న


కలెక్టర్ కార్యాలయం ఎదుట బాధితులకు మద్దతు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్, డిసెంబర్ 14(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ రిమ్స్ హాస్టల్‌లో బుధవారం అర్ధ రాత్రి వైద్య విద్యార్థులపై దుండగులు దాడి చేశారు. రిమ్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న క్రాంతికుమార్.. వసీం, క్రాంతిలను కారులో తీసుకొచ్చి మెడికోలపై దాడికి పాల్పడగా పలువురికి గాయాలయ్యాయి. దీంతో రిమ్స్ ఎదుట విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ క్రాంతి కుమార్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఘటన విషయం తెలుసుకున్న పోలీసులు రిమ్స్‌కు చేరుకుని పలువురిని అరెస్ట్ చేశారు. దాడిని నిరసిస్తూ మెడికోలు ఉదయం భారీగా ఆందోళన చేపట్టారు. విధులు, తరగతులు బహిష్కరించి కళాశాల ఎదుట బైఠాయించారు. దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని, డైరెక్టర్‌ను సస్పెండ్ చేయాలని, క్రాంతి కుమార్‌ను విధుల నుంచి తొలగించాని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. పోలీసులు విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. గాయపడిన మెడికో కవిరాజ్ ఫిర్యాదు మేరకు రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతి కుమార్, వసీం, ఇతరులపై కేసులు నమోదయ్యాయి. కాగా.. మెడికోల ఫిర్యాదు మేరకు ఆదిలాబాద్ టూటౌన్ పోలీసులు బీజేపీ కార్యకర్త శివపై కేసు నమోదు చేశారు. కాగా.. ఆదిలాబాద్ ఎమ్మెల్యేగా గెలిచిన పాయల్ శంకర్‌కు శివ, మరో నాయకుడితో కలిసి అభినందనలు తెలిపిన పోస్టర్‌లు పట్టణంలో దర్శనమిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

### కలెక్టర్ ఎదుట ధర్నా

రిమ్స్‌లో ఆందోళన అనంతరం మెడికోలు కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, తమపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడి విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న కలెక్టర్ కార్యాలయం ఎదుట వారితోపాటు ఆందోళనలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, ఇతర పార్టీల నాయకులు విద్యార్థులకు మద్దతుగా నిలిచారు. రెండు గంటలపాటు విద్యార్థులు నిరసన చేపట్టారు. అధికారులు, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి వైద్య విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా కలెక్టర్ రావాలని పట్టుపట్టారు. కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆందోళన జరుగుతున్న ప్రదేశానికి చేరుకుని వైద్య విద్యార్థులతో మాట్లాడారు. మెడికోలు తమపై జరిగిన దాడి వివరాలను కలెక్టర్‌కు వివరించి నిందితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా.. ఈ విషయమై దుండగులపై చర్యలు తీసుకోవాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్ కలెక్టర్ రాహుల్‌రాజుకు ఫిర్యాదు చేశాడు. ఈ ఘటన సంబంధించిన అదనపు కలెక్టర్ పూర్తిస్థాయిలో విచారణ చేపడుతారని, నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ విద్యార్థులకు హామీ ఇచ్చారు. మెడికోలు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ హామీతో వైద్య విద్యార్థులు తమ ఆందోళన విరమించారు.

### ఇద్దరు సభ్యులతో విచారణ కమిటీ..

విద్యార్థులపై దాడి ఘటనలో విచారణ జరపడానికి వైద్యవిద్యా డైరెక్టర్ కే.రమేశ్‌రెడ్డి ఇద్దరు సభ్యుల కమిటీని నియమించారు. నిజామాబాద్ ప్రభుత్వం మెడికల్ కళాశాలలో సైక్రాట్రీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ శివప్రసాద్, పల్మనాలజీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ వీవీ రావులు కమిటీలో ఉన్నారు. వీరు రిమ్స్ విద్యార్థులు, ప్రొఫెసర్లతో మాట్లాడి పూర్తి నివేదికను వైద్య విద్యా శాఖ డైరెక్టర్‌కు అందజేస్తారు.


మెడికోలతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ రాజ్

### చర్యలు తీసుకోవాలి..



*మెడికోలపై దాడికి పాల్పడిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. డైరెక్టర్‌ను సస్పెండ్ చేయాలి. దాడికి పాల్పడిన అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతి కుమార్‌ను విధుల నుంచి తొలగించాలి. బయటి వ్యక్తులు హాస్టల్ క్యాంపస్‌లోకి రాకుండా భద్రత పెంచాలి. నిందితులపై చర్యలు తీసుకునేంత వరకు విధులు బహిష్కరించి ఆందోళన చేపడుతాం.*

- భరత్, మెడికో, రిమ్స్

### నిందితులను శిక్షించాలి..



*అర్ధరాత్రి రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతి కుమార్ కొంతమంది దుండగులను తీసుకొచ్చి విద్యార్థులపై దాడి చేయించారు. ఈ ఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. దాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి.*

- నవీన్, వైద్య విద్యార్థి, రిమ్స్

### తీవ్రంగా ఖండిస్తున్నాం..

*రిమ్స్ హాస్టల్‌లో మెడికోలపై దుండుగులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ తెలిపారు. దాడికి పాల్పడిన అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రాంతికుమార్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. ఈ ఘటనకు సంబంధించిన 12 మంది సీనియర్ వైద్యులతో కూడిన విచారణ బృందాన్ని ఏర్పాటు చేశామని, కమిటీ ఐదు రోజుల్లో పూర్తిస్థాయి నివేదిక అందజేస్తుందన్నారు. నివేదక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతామని, భద్రత పెంచుతామని డైరెక్టర్ తెలిపారు.*

- జైసింగ్ రాథోడ్, డైరెక్టర్, రిమ్స్

